క్లుప్తంగా

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన సత్రంను ప్రారంభించారు. ఇందులో భాగంగా భక్తులు గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీఓ జగదీశ్వరాచారిని సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఎంపీడీఓగా ఇటీవల బదిలీపై వచ్చిన జగదీశ్వరాచారిని గురువారం ఎంపీపీ స్వరూప, కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు



హోమం చేస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని రాజిపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు బాపుశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మంటపారాధన, స్వామి వారికి అభిషేకం, హోమం నిర్వహించారు. వార్షికోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో సీతారాములు కల్యాణం, పల్లకీసేవ ఉంటుందన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



రోడ్డును ఆనుకొని ఏర్పడ్డ గొయ్యి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ రహదారి గుండా టేక్మాల్, పాపన్నపేట మండలాలకు వెళ్లే రోడ్డు పక్కన ఏర్పడ్డ గొయ్యి ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ కల్వర్టు ఉండేది. అది కాస్త కుడివైపు మట్టితో కూరుకుపోయి, మరోవైపు పెద్దగొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాద బారిన పడడం ఖాయం. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చే పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బంజారాలు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న రామారావు మహారాజ్

కౌడిపల్లి(నర్సాపూర్): బంజారాలు ఐక్యంగా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని మహారాష్ట్ర పొరదేవి ఆలయం నుండి వచ్చిన రామారావు మహారాజ్ అన్నారు. గురువారం ఆయన, తన మిత్రుడు నెహ్రూ మహారాజ్‌తో కలసి మండలంలోని పలు గిరిజన తండాలను పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారా పద్ధతులు, సంప్రదాయాలు కొనసాగిస్తూనే, అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన జన సమితి నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్ నాయక్, మాజీ జెడ్పీటీసీ దేవులానాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో నీటి గోస



అంగన్‌వాడీ సెంటర్‌లో భోజనం చేస్తున్న పిల్లలు, తల్లులు



నీరు మోసుకొస్తున్న ఆయా వజ్రమణి

నర్సాపూర్: అంగన్‌వాడీ కేంద్రంలో నీటి సరఫరా సదుపాయం లేక అనేక అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్‌లోని 13వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉన్నా.. నీటి కోసం నల్లా కనెక్షన్ లేదు. అంగన్‌వాడీ కేంద్రానికి 25 మంది చిన్నారులు చదువుకునేందుకు , 25 మంది తల్లులు రోజూ భోజనానికి వస్తారు. వారందరికీ భోజనం వండేందుకు, పిల్లలు బాత్‌రూం అవసరాలకు నీటిని అంగన్‌వాడీ సెంటర్‌లోని ఆయా వజ్రమణి చుట్టు పక్కల ఉన్న ఇళ్ల నుంచి నీటిని బిందెలతో ఎత్తుకొని వచ్చి అందుబాటులో ఉంచుతుంది. రోజు పది నుంచి పదిహేను బిందెల నీరు అవసరమవుతుందని అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ తెలిపారు. నీటి సమస్యను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ సెంటరులో నీటి నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా నర్సాపూర్‌లోని పలు ఇతర అంగన్‌వాడీ సెంటర్లలో సైతం నీటి సమస్య ఉంది. సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా భవనాలకు నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేకించి సంపులు లేనందున ఇళ్ల యజమానుల నుంచి నీటిని తీసుకుంటున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ డీఈఈ కిషన్ దృష్టికి తీసుకుపోగా త్వరలో నల్లా కనెక్షన్ ఇస్తామని చెప్పారు.

కష్టంగా ఉంది

అంగన్‌వాడీ సెంటరులో వంట చేసేందుకు, ఇతర అవసరాల కోసం రోజూ పది నుంచి 15 బిందెల నీరు అవసరమవుతుంది. నల్లా లేక నీరు రానందున చుట్టు పక్కల ఇళ్ల నుంచి రోజూ నీళ్లు మోసుకురావడం చాలా కష్టంగా ఉంది. నల్లా కనెక్షన్ ఇచ్చి నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వజ్రమణి, అంగన్‌వాడీ ఆయా

సమయపాలన పాటించకుంటే చర్యలు



ఎల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ నీలకంఠం

పాపన్నపేట(మెదక్): టీచర్లు సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ నీలకంఠం అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఎల్లాపూర్, తమ్మాయపల్లి, చీకోడ్, మల్లంపేట, కుర్తివాడ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీచర్లు సమయానికి పాఠశాలకు రావాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థుల సన్నద్ధతపై దృష్టి సారించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్‌లతో ఆడకుండా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ రోజు ప్రత్యేక తరగతులు క్రమం తప్పకుండా నడపాలని హెచ్‌ఎంలకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని గజ్వేల్ ఏఎస్‌ఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జాలిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళల రక్షణ చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతలపై గజ్వేల్ షీ టీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములుతో కలిసి అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం తెలపొద్దన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సబిత

చిన్నశంకరంపేట(మెదక్): మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నార్సింగి ఎంపీపీ చిందం సబిత కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, ఎంపీఓ నరేశ్, ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి



నర్సాపూర్‌లోని పదో వార్డులో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం ఆయన పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌తో కలిసి పదో వార్డులో పర్యటించారు. సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ఉండాలని సకాలంలో పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది మురళీ, ఉదయ్ కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బడిలో మందుబాబుల ఆగడాలు



చిన్నచింతకుంట ప్రాథమిక పాఠశాల వరండాలో మద్యం సీసాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంట ప్రాథమిక పాఠశాల వరండా మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాలలో ప్రతీ రోజు రాత్రి వేళ మందుబాబులు మద్యం సేవిస్తూ ఆ ప్రాంతాన్ని దుర్గంధంగా మారుస్తున్నారు. ఉదయం పాఠశాలకు విద్యార్థులు రాగానే మద్యం సీసాలు, చిరుతిళ్ల కవర్లు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల నంబర్–2లో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలోని చాకలివాడ ప్రాథమిక పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వేర్వేరుగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈసందర్భంగా రెండు స్కూళ్లలో సీనియర్ విద్యార్థులు జూనియర్లకు పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. డీఈఓ, ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎంలుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో రెండు పాఠశాలల హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి, జయమ్మ, ఉపాధ్యాయులు యాదగిరి, అన్నపూర్ణ, ప్రణీత్, దేవిక, ప్రణతి, తదితరులు పాల్గొన్నారు.

బాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని బాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన జరుపుకొన్నారు.

తూప్రాన్: మండలంలోని వెంకటాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు శివకుమార్, కిష్టయ్య, కొండల్‌రెడ్డి, వి.పద్మ, జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారని హెచ్‌ఎం వెంకటస్వామి తెలిపారు. మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



పాపన్నపేట(మెదక్): బాచారం పాఠశాలలో..



తూప్రాన్: వెంకటాయిపల్లి పాఠశాలలో ..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



రామాయంపేటలో ..



టేక్మాల్‌లో ..

మంత్రి సురేఖ కోలుకోవాలని పూజలు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కోలుకోవాలని కాంగ్రెస్ నాయకులు కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కొద్దిరోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిపారు. మంత్రి త్వరగా కోలుకొని ప్రజాసేవలో పాల్గొనాలని ఆలయంలో పూజలు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలుగుల రమేశ్‌తో పాటు బీకొండాపూర్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకర రోడ్డుపై నడిచేదెలా ?

- నత్తనడకన మరమ్మతులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు




అధ్వానంగా నస్కల్ కంకర రోడ్డు

నిజాంపేట(మెదక్): గ్రామాల్లో రోడ్లు సరిగ్గా లేక పోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి నస్కల్, నందగోకుల్ మీదుగా చల్మెడ గ్రామం నుంచి నేషనల్ హైవే 765డిజి వేళ్లే రహదారిని కలుపుతూ రోడ్డు నిర్మాణానికి గత ఏడాది క్రితం రూ. 18 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మండల కేంద్రం నుంచి నస్కల్ గ్రామానికి 2 కిల్లోమీటర్ల దూరం వరకు రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. నాలుగు నెలలుగా పనులు జరగడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని నస్కల్, నగరం, రాంపూర్, నందగోకుల్ గ్రామాలతో పాటు కామారెడ్డి జిల్లాకు చెందిన బీబీపేట, దోమకొండ మండలాలకు రోజు వందల మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. మండల కేంద్రానికి చెందిన మల్కా చెరువు మత్తడి వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం దీనిపై అధిక బరువు ఉన్న పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఈ బ్రిడ్జి కూలితే.. నస్కల్, రాంపూర్, నగరం, గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి 5 కిలోమీటర్లు ఎక్కువ దూరం ప్రయాణించి రావాల్సి ఉంటుంది.

అంబులెన్స్‌కు తప్పని తిప్పలు

నస్కల్, రాంపూర్, నందగోకుల్, నగరం గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురైనా.. ఏదైనా ప్రమాదం జరిగినా కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేకపోతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


భయంగా ఉంది



మండల కేంద్రానికి పని మీద రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వస్తున్నాం. రోడ్డులో పూర్తిగా కంకర వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు నడిపేప్పుడు అదుపు తప్పి పడిపోతున్నాం. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంగా ఉంది.

– గుగ్‌లోత్ నాజం, నగరం

ఇబ్బందులు పడుతున్నాం



మాది నస్కల్ గ్రామం. మేము ఎన్నో పనుల మీద నిజాంపేటకు వస్తుంటాం. కానీ మా రెండు గ్రామాల మధ్య కంకర వేసి వదిలేయడంతో ఆ దారి నుంచి కాకుండా చల్మెడ గ్రామం నుంచి తిరిగి 5 కిలోమీటర్లు ఎక్కువ దూరం ప్రయాణిస్తున్నాం. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– నెంటూరి రమేశ్‌గౌడ్, నస్కల్

మొక్కులు తీర్చుకున్న బీఆర్ఎస్ నాయకులు



శ్రీశైలంలో బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి విజయం సాధిస్తే శ్రీశైలం వచ్చి మొక్కులు చెల్లిస్తామని దేవుడికి మొక్కుకున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శ్రీశైలంకు వెళ్లిన వారిలో సూరారం నర్సింలు, రాంచందర్, శ్రీశైలంయాదవ్, దశరథ, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన సాల్మన్, భార్య మంజుల అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి వారికి చికిత్స నిమిత్తం రూ.50వేలు అందజేశామని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, సిద్ధగిరిగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, పరశురామ్, డాక్టర్ రాములు, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

చేయూత

రామాయంపేట(మెదక్): అగ్ని ప్రమాద బాధితుడికి గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేయూత అందించారు. మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన గడ్డం రాజయ్య నివాస గుడిసె ఐదు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ. 25 వేలు అందజేశారు.